

హకీంపేట్ ఎయిర్‌పోర్టులో భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు ఘనస్వాగతం పలికిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ దృశ్యం



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ఓఆర్ఆర్‌పై హైడింగ్‌మనీ..చందుపై కేసు నమోదు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** ఓఆర్ఆర్‌పై హైడింగ్‌మనీ విడియో చేసి వాహనదారులను ఆకర్షించి తప్పుదోవపట్టిస్తున్న య్యూట్యూబ్ యాంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరశురాం తెలిపారు. ఔటర్‌రింగ్‌రోడ్డుపై ఘట్‌కేసర్ సమీపంలోని ఎగ్జిట్-9 వద్ద య్యూట్యూబర్ చందు డబ్బులను చూపిస్తూ విడియో చేసి చెట్ల పొదల్లో రూ.200 నోట్ల కట్టను వేశారు. కావాల్సిన వారు ఇక్కడికి వచ్చి 20 వేలు తీసుకోవాలని విడియోలో తెలియజేశారు. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులకు ఆటంకం కల్గిస్తున్నాడని ఓఆర్ఆర్ సిబ్బంది మంగళవారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బండారు శ్రీరాములు ఓఆర్ఆర్‌పై శామీర్‌పేట్ నుంచి బొంగుళూరు వరకు పట్రోలింగ్ వాహనం ఇంచార్జ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఓఆర్ఆర్ పక్కన చెట్ల కింద వేసిన డబ్బులు తీసుకోవాలని చందు తన ఫాలోవర్స్‌ను ఆకర్షించి వాహనదారులకు ఇబ్బందులు కల్గజేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ జరిపి ఘట్‌కేసర్ ఎస్ఐ ఎ.శేఖర్ బిఎన్ఎస్ 292, 125 సెక్షన్ 8 కింద జాతీయరహదారి చట్టం-1956 ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ పరశురాం తెలిపారు.

# నెల చివరిలోపు ఇస్తెమా పనులు పూర్తి చేయాలి : కలెక్టర్ నారాయణరెడ్డి

**శంకర్ పల్లి, డిసెంబర్ 17, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లిలో జనవరి 4, 5 తేదీలలో నిర్వహించే ఇస్తెమా కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శంకర్ పల్లిలో జనవరి 4, 5 తేదీలలో నిర్వహించే ఇస్తేమ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ముస్లిం మత పెద్దలు, అధికారులతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, మత పెద్దలు సమన్వయంతో పని చేస్తూ ఇస్తేమ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. ఇస్తేమా కార్యక్రమానికి లక్షలాది మంది హాజరు అవుతున్న నేపథ్యంలో డివైడర్లతో కూడిన విస్తీర్ణమైన రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పార్కింగ్ స్థలాలను గుర్తించాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇస్తేమా కార్యక్రమం



విజయవంతం దిశగా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మంచి నీరు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ తెలిపారు. విద్యుత్తు అంతరాయం లేకుండా తగినన్ని ట్రాన్స్ఫార్మర్లను, పోల్స్, వైరింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తగినన్ని మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనుల విషయంలో పెద్ద మొత్తంలో సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్ర త్తలు తీసుకోవాలని శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. లైటింగ్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజు సంబంధిత అధికారులు తమకు నిర్దేశించిన పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ శాసన సభ్యులు కాలె యాదయ్య, తెలంగాణ మైనారిటీల రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషనల్ సొసైటీ వైస్ చైర్మన్ ప్రెసిడెంట్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ, ఆర్డీ వో చంద్రకళ, డిఎండబ్ల్యుఓ నవీన్ రెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, ఈఈ ఆర్.డబ్ల్యూఎస్ రాజేశ్వర్, మిషన్ భగీరథ అధికారులు, తహసిల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

### -జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:**
జిల్లాలో ప్రతి హాస్టల్‌లో పిల్లలకు త్రాగు నీరు, టాయిలెట్స్, లైట్స్, ఫ్యాన్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నుండి ఎస్సి, ఎస్‌టి, బీసీ, మైనార్టీ అధికారులు, హాస్టల్స్ వార్డెన్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉండే ఎస్సి, ఎస్‌టి, బిసి, బాలుర, బాలికలు హాస్టల్స్‌లో ఉండే మేజర్, మైనర్ రిపేర్ పనులపై దృష్టి పెట్టాలని అన్నారు. వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలనీ సూచించారు. ప్రతి హాస్టల్‌లో పిల్లలకు అవసరమయ్యే త్రాగునీరు, టాయిలెట్స్, మైనర్ రిపేర్ పనులు, లైట్స్. ఫ్యాన్లు తప్పనిసరిగా పెట్టించాలన్నారు. ప్రతి హాస్టల్ వారీగా ఇచ్చిన అంచనా ప్రకారం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పనులపై దృష్టి సారించి పూర్తి చేయాలనీ ఆదేశించారు. మేజర్, మైనర్ రిపేర్ పనులకు ముందు తర్వాత ఫోటోలు తప్పనిసరిగా పంపించాలన్నారు. హాస్టల్స్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విదంగా పర్యవేక్షణ చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా అన్ని మండలాల వారిగా హాస్టల్స్‌లో ఉండే సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుదీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## 19న రైతు సంఘం మేడ్చల్ జిల్లా 3వ మహాసభలు

### -మేడ్చల్ జిల్లా రైతుసంఘం అధ్యక్షులు నిమ్మల నర్సింహ్మ



.శామీర్‌పేట మండలంలో పర్యటించిన జిల్లా రైతుసంఘం నాయకులు జిల్లా అధ్యక్షులు నిమ్మల నర్సింహ్మ, నాయకులు డిజి సాయిలుగౌడ్, దశరథ, జంగయ్య పలువురు నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 17, ప్రభాతవార్త**
ఈ నెల 19వ తేదీన శామీర్‌పేట మినీస్టేడియంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా 3వ మహాసభలు జరుగుతున్నందున పెద్ద ఎత్తున రైతులు పాల్గొని విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నిమ్మల నర్సింహ్మ, నాయకులు డిజి సాయిలుగౌడ్, ధశరథ, జంగయ్యలు కోరారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల్లో జిల్లా రైతుసంఘం నాయకులు, సిపిఐ నాయకులు పర్యటించి రైతులను కలిసి జిల్లా రైతుసంఘం మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 19న ఉదయం 10.30గంటలకు శామీర్‌పేట మినీస్టేడియంలో మహాసభలు ప్రారంభం కానున్నట్లు వారు తెలిపారు. బాబగూడ, పొన్నాల్, జగ్గంగూడ, కేశవరం గ్రామాల రైతులను వారు కలిసి రైతు మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. రైతు సమస్యల పరిష్కారం కోసం రైతుసంఘం మహాసభలో చర్చించటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నిమ్మల నర్సింహ్మ, సహాయ కార్యదర్శి ఏఐకెఎస్ డి.జంగయ్య, బిసి హక్కుల సాధనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ, రాష్ట్ర గీతపనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, శామీర్‌పేట మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు. రైతులను రైతుసంఘంలో వారు సభ్యులుగా చేర్పించారు. రైతుసంఘం మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

## 23న గట్టుమైసమ్మగుట్ట ఆలయ టెండర్ల బహిరంగ వేలం

**ఘట్‌కేసర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:**
ఈనెల 23న ఘట్‌కేసర్ శ్రీగట్టుమైసమ్మగుట్ట దేవస్థానంలో టెంకాయలు, పూజా సామాగ్రీ సరఫరా హక్కులకు బహిరంగ వేలం వేయనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి ఎల్.భాగ్యలక్ష్మి మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శ్రీగట్టుమైసమ్మగుట్ట దేవస్థానం మండపంలో సోమవారం ఉదయం 11 గంటలకు దేవాదాయ-ధర్మాదాయశాఖ నియమ నిబంధనలను అనుసరించి నిర్వహించే వేలంలో ఆసక్తి కల్గిన వారు పాల్గొనాలని కోరారు. కొబ్బరికాయలు, పూజాసామాగ్రీ టెండర్ కాలపరిమితి 1 జనవరి 2025 నుంచి 31 డిసెంబర్ 2025 వరకు ఉంటుందని దీనికి రూ.10,000లు ధరావత్తు చెల్లించాలని తెలిపారు. దేవాలయ ఉద్యోగులు, ఆలయానికి బకాయి పడిన వారు వేలంలో పాల్గొనుటకు అనర్హులని, వేలంలో పాల్గొనే వారు ముందుగా దేవస్థానంలో ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ధరావత్తు చెల్లించని వ్యక్తి వేలంలో ప్రత్యేక్షంగా గాని పరోక్షంగా గాని పాల్గొనే అవకాశం ఉండదని, హెచ్చుపాటదారుని వేలం పాట దేవాదాయశాఖ ఆమోదం మేరకు ఉంటుందన్నారు. వేలం పాట అయిన వెంటనే హెచ్చుపాటదారుడు వేలం సొమ్ము సగం వెంటనే చెల్లించాలని మిగతా సొమ్ము 2 రోజులలోపు చెల్లించాలని పేర్కొన్నారు. దేవస్థానం నిర్దేశించిన స్థలంలోనే సదరు దుకాణం నిర్వహించాలని, ఏడాది కాలపరిమితి ముగిసిన తర్వాత దుకాణాలను ఖాళీ చేసి దేవస్థానంకు అప్పగించాలని పేర్కొన్నారు. సమయానుకూలంగా షరతులు మార్చుటకు, ఎలాంటి కారణం చూపకుండానే వేలం పాటను నిలుపుదల, వాయిదా వేయడానికి దేవస్థానంకు సంపూర్ణ అధికారం ఉందని ఈఓ భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు.

## రైతులను క్షోభకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**పరిగి డిసెంబర్ 17 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు వికారాబాద్ జిల్లా, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అధ్యక్షతన పరిగి మునిసిపల్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, అనేక ఆంక్షలు విధించి, గుండె నొప్పితో బాధపడుతున్న బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం అమానుషమని, శారీరకంగా వారిపై దాడి చేసి, థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వ ఆగడాలని ఇకనైనా ఆపాలని, రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని పార్టీ తరపున, రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## తుర్కపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన ఎంపిడిఓ

**శామీర్‌పేట, డిసెంబరు 17, ప్రభాతవార్త**
తుర్కపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే నమోదు కార్యక్రమాన్ని శామీర్‌పేట ఎంపిడిఓ మమతా బాయి సందర్శించి పరిశీలించారు. గతంలో ప్రజాపాలనలో ఇండ్ల కోసం ధరఖాస్తులు చేసుకున్న వారిలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం లబ్దిదారుల ఎంపికకు సర్వే కార్యక్రమంను ప్రభుత్వం చేపట్టింది. ఇంటింటా పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల కోసం ధరఖాస్తులు చేసుకున్న వారి స్థితిగతులను మొబైల్ యాప్‌లో నమోదును సర్వే సంబంధిత అధికారులు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి విజయకుమార్, బిల్‌కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### -జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:**
ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కల్లెక్టరేట్ కార్యాలయం కాన్ఫరెన్సు హాలు నుండి కమిషనర్‌లు, ఎంపీడీఓ లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ది చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేయాలనీ తెలిపారు. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను నమోదు చేసేందుకు ఎంత సమయం పడుతోంది, రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు, సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? ఇప్పటివరకు ఎంతమంది వివరాలను సేకరించారు, ఆన్లైన్లో ఎన్ని వివరాల ు అప్లోడ్ చేశారని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పకుండా పాటిస్తూ, తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరిస్తూ ఆన్లైన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పురాతన, శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా ఉంటే, వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే, అలాంటి వారి వివరాలను సర్వే యాప్ లో పొందుపర్చాలని అన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా లబ్ది చేకూరేందుకు వీలుగా వివరాల నమోదులో అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుదీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను కలిసిన ప్రైవేటు కళాశాలల యాజమాన్యం సంఘం

**వికారాబాద్ రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:**
గత మూడు సంవత్సరాల ుండి స్కాలర్ షిప్, ఫీజు బకాయిలు రాక కళాశాల ల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం తెలిపింది. రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క సోమవారం రాత్రి తన ఛాంబర్ లో రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ ,బిఈడి కళాశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధులతో స్కాలర్షిప్, ఫీజు బకాయిల విషయమై చర్చించేందుకు ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యాలు మాట్లాడుతూ, స్కాలర్షిప్,ఫీజ్ బకాయిలు రాక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని సిబ్బందికి జీతాలు చెల్లించలేక, భవనాలకు అద్దెలు కట్టలేక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని తెలిపారు. ఆర్థిక సమస్యలు తట్టుకోలేక కొందరు యాజమాన్య సభ్యులు కళాశాలలో మూసివేశారని, మరికొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయాలను విని సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. గత ప్రభుత్వ



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘం సభ్యులు

హయాంలో మూడు సంవత్సరాలుగా ఉన్న బకాయిల ను ఒకే సారి చెల్లించే ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం లేదని, దశల వారిగా చెల్లించి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, కళాశాలల యాజమాన్యాలను ఆదుకుంటామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుండి మొదలు పెట్టి, వీలైనన్ని బకాయిలను ఈ ఆర్థిక సంవత్సరంలో చెల్లిస్తామని పేర్కొన్నారు. మిగితా బకాయిలను వచ్చే సంవత్సరం చెల్లిస్తామని పేర్కొన్నట్లు వారు తెలిపారు. అనంతరం సంఘం తరపున అధ్యక్షులు గౌరీ సతీష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం ను శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో జూనియర్,డిగ్రీ, బీఈడీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు రాష్ట్ర అధ్యక్షులు గౌరీ సతీష్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పార్థసారథి, మల్లేశం, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, జహీర్లతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి,ఉన్నత విద్యా మండలి చైర్మన్, రాష్ట్ర విద్యా శాఖా ముఖ్య కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో 28 కిలోల గంజాయి పట్టివేత

### -ఇద్దరి అరెస్టు..

**వికారాబాద్,డిసెంబర్ 17, ప్రభాతవార్త:**
రైలులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ విక్రయిస్తున్న ఇద్దరు నింధితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వికారాబాద్ జిల్లా ఎక్సైజ్‌శాఖ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైజాగ్ నుంచి ముంబాయి బయల్దేరిన లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ రైలులో 28 కేజీల గంజాయినీ గుట్టు చప్పుడు కాకుండా తీసుకెళ్తున్నట్లు సమాచారాన్ని వికారాబాద్ ఎక్సైజ్ పోలీసులు పసిగట్టారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.విజయభాస్కర్ ఆదేశాల మేరకు.. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతం, వికారాబాద్ పట్టణంలో ఓ వ్యక్తి గంజాయి రవాణా, అమ్మకాలు చేస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. లోకమాన్య తిలక్ వైజాగ్-ముంబై ఎక్స్‌ప్రెస్ ట్రైన్ వికారాబాద్



నింధితుల వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని, నింధితులను రిమాండ్‌కు తరలిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

రైల్వే స్టేషన్లో వచ్చి ఆగింది. ఎక్సైజ్ దాడుల్లో భాగంగా ఈ రైలులో తనిఖీ చేయగా..జితేంద్ర మంజునాథ్ నాయక్, ప్రతిభ అన్నప్పకు సంబంధించిన బ్యాగులను తనిఖీ చేయగా, 28 కేజీల గంజాయి లభించింది. నింధితుల వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు నింధితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిస్టిక్ టాస్క్ ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.7 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ఈ దాడులలో వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాగవీణ, ఎస్సైలు ప్రేమ్‌కుమా ర్‌రెడ్డి, వీరాంజనేయులు, శ్రీనివాస్, సిబ్బంది రవికిరణ్, హనుమంతు, రాధిక, జ్యోతి, ఫరీ ద్, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కొన్నసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

### ..న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న శామీర్‌పేట మండల మండల టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు తిరుమలేశ్ దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 17, ప్రభాతవార్త**
మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో ధర్నా కొనసాగుతుంది. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు 7వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగులు ధర్నా చేసిన తమ నిరసనను తెలియజేశారు. ఈ రోజు వినూత్న తీరులో చాయ్‌కప్పులతో నిరసనలు తెలియజేశారు. సమ్మెలో పాల్గొని ధర్నాలు చేస్తున్న వారికి శామీర్‌పేట మండల టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు తిరుమలేశ్ పాల్గొని మద్దతు పలికారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జెఎసి చైర్మన్ డాక్టర్ వేణు పాల్గొని వారికి మద్దతు తెలిపారు. టియుపిఎస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ పాల్గొని మద్దతు తెలిపారు. టియుపిఎస్ మల్కాజ్‌గిరి బాధ్యులు లక్ష్మయ్య మద్దతు పలికారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల అధ్యక్షులు ఫణికుమార్, ఉపాధ్యక్షులు దేదీప్య, కోశాధికారి మల్లేశ్, సమగ్ర శిక్ష ఉద్యోగుల పలు కమిటీ నాయకులు ఇంద్ర, కృష్ణ, సుధారాణి, జగదీశ్, నిర్మల, సత్యనారాయణ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎదులాబాద్‌లో ధనుర్మాసపూజలు ప్రారంభం



ఎదులాబాద్‌లో ధనుర్మాసపూజలో పాల్గొన్న భక్తులు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత రంగమన్నార్ నాయకస్వామి దేవస్థానంలో ధనుర్మాసపూజలు ప్రారంభం అయ్యాయి. స్థానిక భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నెలరోజుల పాటు వచ్చే నెల 14 వరకు జరిగే ఉత్సవాలకు ఆలయ ధర్మకర్తలు తగిన ఏర్పాట్లు చేశారు. సంక్రాంతికి నెలరోజుల ముందు నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుండగా సూర్యుడు ధనురాశిలో ప్రవేశించిన సమయంలో ధనుస్సంక్రమణం కాగా సంక్రాంతికి మకరరాశిలోకి వస్తాడు. గోదాదేవిని మార్గళివ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసమంతా పూజిస్తారు. ప్రతిరోజు ఉదయమే సుప్రబాతసేవతో మొదలుకొని విశేషపూజలు, ప్రత్యేక అలంకరణలు, అర్చనలతో అండాల్ గోదారంగమన్నార్‌నాయకస్వామిలను ధర్మకర్తలు తిరుప్పావై పారాయణం నిర్వహిస్తున్నారు. ఈమాసంలో సా ్వమికి చక్కెర పొంగలి, ధధ్యోజనం నైవేద్యంగా సమర్పిస్తారు. ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా భక్తుల సందడి నెలకొంటుంది. ఎదులాబాద్ నుంచే కాక హైదరాబాద్ నగరం నుంచి ఇక్కడికి భక్తులు వచ్చి ధనుర్మాస పూజల్లో పాల్గొంటారు. విష్ణుమూర్తికి ప్రీతికరమైన మాసం కావడంతో స్వామికి పూజలు చేస్తే పుణ్యఫలం కల్గుతుందని అర్చకులు పేర్కొన్నారు.

### నేడు పత్తి కొనుగోళ్లు నిలిపివేత : జిల్లా మార్కెటింగ్ అధికారి

**పరిగి డిసెంబర్ 17 ప్రభాతవార్త :** నేడు అనగా బుధవారం పత్తి కొనుగోలును నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ నరసింహ కాటన్ మిల్ పరిగి యందు అధిక మొత్తంలో పత్తి నిలువలు నిండిపోయినందున,పత్తి జిన్నింగ్ చేయటానికి సమయం పడుతుందని, బుధవారం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు నిలిపి వేస్తున్నట్లు రైతులకు గ్రహించగలరని తెలిపారు.రైతు సోదరులు బుధవారం రోజున తమ పత్తిని కాటన్ మిల్లుకు తీసుకురావద్దని తెలియజేశారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**పరిగి డిసెంబర్ 17 ప్రభాతవార్త :** పరిగి మండలం రావులపాలెం గ్రామానికి చెందిన ఈడిగి ఆంజనేయులు, మంగళవారం వ్యక్తిగత పని కోసం తన బైక్ పై షాద్నగర్ వైపు వెళ్తుండగా నర్సాయిగూడ గేట్ సమీపంలో, మధ్యాహ్నం రెండు గంటల సమయంలో టీఎస్ 34 టి 1613 నెంబర్ గల బస్సు బైకు వెనుక నుండి ఢీ కొట్టిన ఘటనలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. అజాగ్రత్తగా బస్సు నడిపిన డ్రైవర్ పై తగు చర్యలు తీసుకోవాలని ఆంజనేయులు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు .

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులతో సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.ముజీబ్‌హుస్సే నీలు

**అఫ్జల్‌గంజ్, డిసెంబరు 17ప్రభాతవార్త:** తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో 11వ బి.స్వామినాథన్ క్రికెట్ టోర్నమెంట్ 2025 పోటిలను తెలంగాణ కేంద్ర కమిటి అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సే నీలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా టిఎన్‌జిఓ ఉద్యోగులందరికి కలిసి క్రీడా పోటిలను నిర్వహించడం పట్ల సంతోషదాయకమన్నారు. క్రీడలు కూడా మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. ఈసమావేశంలో గవర్నమెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ కె.రామిరెడ్డి, లెక్చరర్ విద్యాసాగర్, కేంద్రసంఘం అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, సభ్యులు కొండల్‌రెడ్డి, జిల్లా కార్యానిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, గడ్డం జ్ఞానేశ్వర్, ఉమర్‌ఖాన్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ ముందు డాలర్‌మెడోస్ వాసుల ఆందోళన



ఆందోళన చేస్తున్న డాలర్‌మెడోస్ వాసులు

**దుండిగల్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక సంఘం పరిధి భౌరంపేటలోని డాలర్‌మెడోస్‌కు వెళ్ళే దారిలో విద్యుత్‌శాఖ అధికారులు ఇటీవల రోడ్డుకు అడ్డంగా జెసిబితో తవ్వకాలు చేపట్టడంతో అధికారుల తీరుకు నిరసనగా కాలనీవాసులు మంగళవారం సబ్‌స్టేషన్ ఏదుట ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత 17సంవత్సరాల క్రితం గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి రోడ్డును కేటాయించారన్నారు. గేటెడ్ కమ్యూనిటీ రూపంలో 257 విల్లాలు నిర్మించడంతో తాము కొనుగోలు చేసి నివాసం ఉంటున్నామని, కాలనీకి ప్రభుత్వం వేసిన రోడ్డును విద్యుత్‌శాఖ అధికారులు ధ్వంసం చేయడం సరికాదన్నారు. కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని 2016లో విద్యుత్‌శాఖకు కేటాయించగా సదరు స్థలంలో మధ్యలో నుండి రోడ్డు ఉండడంతో విద్యుత్‌శాఖ, కాలనీవాసులు మధ్య రోడ్డుపై ఒప్పందం చేస్తున్నట్లు తెలిపారు. కాలనీలోకి వెళ్ళే రహదారిని తమ ఆధీనంలో తీసుకోవడానికి ముందు తమకు ప్రత్యామ్నయంగా రోడ్డును చూపాలన్నారు. 2017లో కోర్టును ఆశ్రయించామని, విచారణలో ఉండగా విద్యుత్‌శాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ రోడ్డును ఆక్రమించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, రెవిన్యూ, పురపాలిక కమీషనర్‌కు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని, తమ కాలనీకి ప్రత్యామ్నయంగా రోడ్డును చూపి సమస్యను పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## పవన్ ఆశయాల కోసం పనిచేస్తా

### న-సినీ దర్శకుడు వారణాసి సూర్యా

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశాల కోసం తాను జీవితాంతం పనిచేస్తానని సినీ దర్శకుడు వారణాసి సూర్య అన్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా జనసేన పార్టీని ఏర్పాటు చేసి ఎన్ని ఎదురు దెబ్బలు ఎదురైనా పోరాడి నిలిచిన మహా నాయకుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం పవన్ కళ్యాణ్ అని అన్నారు. అలాంటి నాయకుడికి మద్దతు పలకడమే లక్ష్యంగా 100 రుపీస్ ఎమ్మెల్యే అనే కాన్సెప్ట్ ప్రజల ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఇటీవల కొందరు పవన్ పై ఆరోపణ చేస్తుంటే సహించలేకపోతున్నట్లు చెప్పారు. జనసేనను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తారని భవిష్యత్తులో జనసేన అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని లేనిపక్షంలో స్వతంత్రంగా పోటీ చేసి పవన్ కు అండగా నిలుస్తానని పేర్కొన్నారు.

## దిల్‌రాజ్‌ను కలిసిన సెన్సార్‌బోర్డు మెంబర్ సుధాకర్

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రభుత్వం స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజును ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ సుధాకర్ దిల్‌రాజ్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిపారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమ గురించిన పలు అంశాలను చర్చించారు. సినీ పరిశ్రమ గురించి పూర్తి అవగాహన కలిగిన దిల్ రాజును ఎఫ్‌డీసి చైర్మన్‌గా నియమించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## సాంకేతిక పురోగతితో దేశ రక్షణకు శ్రమించండి

### -గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



జిటిసి ఇన్‌చీఫ్ ట్రోఫీని అందుకుంటున్న లెఫ్టినెంట్ ముదిత్ గుప్త

**అల్వాల్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** సాంకేతికతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ దేశ రక్షణకు నిబద్ధతతో పని చేయాలని యువ సైనికాధికారులను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కోరారు. మంగళవారం తిరిమిలగిరి ఎంసిఇఎంఇ కళాశాలలో జరిగిన 105వ డిగ్రీ ఇంజనీరింగ్ కోర్సు, 42వ టెక్నికల్ ఎంట్రీ కోర్సు స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసిన 49 మంది అధికారులకు ఆయన పట్టాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతికత అనే అస్త్రం నేడు ప్రధాన భూమిక పోషిస్తోందని తెలిపారు. ఇంజనీరింగ్ కోర్సులో సాధించిన మేదో సంపత్తి జ్ఞానాన్ని ఆవిష్కరణలు కోసం వెచ్చించాలని కోరారు. సాయుధ సంపత్తిని సర్వత్రా యుద్ధ తంత్రానికి సిద్ధంగా ఉంచే బాధ్యత ఇంజనీర్లపై ఉంటుందన్నారు. టిఇఎస్ కోర్సులో ఉత్తముడిగా నిలిచిన లెఫ్టినెంట్ ముదిత్ గుప్త జిటిసి ఇన్ చీఫ్ ట్రోఫీని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిఇఎంఇ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షనే ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రోజాదేవి



అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 126 డివిజన్ జగద్గిరిగుట్ట బిఆర్‌ఎస్ శ్రేణులు



రాష్ట్ర ప్రభుత్వానికి సద్బుద్ధిని ప్రసాదించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బండ్లగూడ కార్పోరేషన్ బిఆర్‌ఎస్ నేతలు.



తుకారాంగేట్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తదితరులు

## లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి : బిఆర్ఎస్

**వివేకానంద నగర్ డివిజన్‌లో...**

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు సూచనల మేరకు లగచర్ల రైతులపై జరిగిన దాడికి అరెస్టుకు నిరసనగా శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని రిక్షా పుల్లర్స్ కాలనీలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి ఆమె వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల భద్రయ్య, వేముల ఆంజనేయులు, జగదీష్ గౌడ్, యశ్వంత్, ప్రవీణ్, పర్వతాల సతీష్ కుమార్, కిరణ్, సత్యనారాయణ, లక్ష్మణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

**ప్రగతి నగర్‌లో...**

**జీడిమెట్ల, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలలో భాగంగా మంగళవారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు గాజుల సుజాత, బాలాజీ నాయక్, బొర్రా దేవి చందు ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, లగచర్ల రైతుల గోసలు వినతిపత్రం రూపంలో సమర్పించి నిరసన తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళా అధ్యక్షులు, యువజన విభాగ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సోషల్ మీడియా వారియర్స్, ఉద్యమకారులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్టలో..**

**కొంపల్లి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** 126 డివిజన్ జగద్గిరిగుట్ట కుత్బుల్లాపూర్ భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తోందని బీఆర్ఎస్ నాయకులు వాపోయారు. ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలని రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్‌కు 126 డివిజన్ జగద్గిరిగుట్ట బిఆర్ఎస్ శ్రేణులు విజ్ఞప్తి చేశారు.

**దుండిగల్ పురపాలిక పరిధిలో**

**దుండిగల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతన్నలపై జరుగుతున్న అరాచకాలు, అణిచివేతలతో పాటు లగచర్ల రైతన్నలను కాపాడాలని కోరుతూ బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు దుండిగల్ పురపాలిక పరిధిలోని ఆయా ప్రాంతాల్లో గల డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు సత్యనారాయణ, మహేందర్‌యాదవ్, సాయియాదవ్, ఆనంద్‌కుమార్, నాయకులు, దళిత, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**బండ్లగూడ కార్పోరేషన్‌లో...**

**నార్సింగి, డిసెంబర్ 17 ప్రభాతవార్త :** అధికార మదంతో అంధులై... అన్నం పెట్టే రైతన్నలకు బేడీలు వేసి జైళ్లకు పంపిన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం బండ్లగూడ కార్పోరేషన్ బిఆర్ఎస్ నాయకులు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజు మాట్లాడుతూ లగచర్ల గ్రామ రైతులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ రవీందర్‌రెడ్డి, నాయకులు రాముడు యాదవ్, చంద్రారావ్, వెంకటేష్, పెంటయ్య యాదవ్, ఇస్మాయిల్, కీర్తికాంత్, మహేష్, మల్లేశ్వరి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**అడ్డగుట్ట డివిజన్‌లో..**

**అడ్డగుట్ట, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** లగచర్ల రైతులపై అక్రమ కేసులు బణాయించి జైల్‌లో నిర్బందించడం హేయమైన చర్య అని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం తుకారాంగేట్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. లగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పాలనగా ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నక్క మధు, లింగాని శ్రీనివాస్, పెండెం మనోహర్, శ్రీనివాస్ గౌడ్, సత్తయ్య గౌడ్, శివశంకర్, దాసరి శ్రీనివాస్, దేవయ్య, పొన్నాల రాజు, వడ్డెర ఎల్లయ్య, అయోధ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**బోయిన్‌పల్లిలో...**

**కంటోన్మెంట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** అన్నంపెట్టే రైతులపై అ క్రమ కేసులు బణాయించి అన్నదాతలను జైలుపాలు చేయడం సరైంది కాదని, బేవరేజెస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమ కారుడు గజ్జెల నాగేశ్ డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం కంటోన్మెంట్, బోయిన్‌పల్లి మార్కెట్ వద్ద ఉన్న బాబాసాహెబ్ అంబ్కేర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రావుల సతీష్, సత్యనారాయణ గౌడ్, ఏ.ఎల్.ఆనంద్, గంగారామ్, సతీష్, శేఖర్, కనకయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## కిస్మత్‌పూర్‌లో పెన్షనర్ల భవనం ప్రారంభం



పెన్షనర్ల భవనం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, డిసెంబర్ 17 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో రూ.90.లక్షలతో నిర్మించిన పెన్షనర్ల భవనంను మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "జాతీయ పెన్షనర్ల దినోత్సవం" రోజే పెన్షనర్ల భవనంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పెన్షన్ అనేది వృద్ధాప్యంలో సురక్షిత భవిష్యత్తు కోసం, స్థిరమైన ఆర్థిక ఆధారమని పేర్కొన్నారు. ఉద్యోగస్థులు జీవితాంతం కష్టపడి పోగు చేసుకొన్న డబ్బులో నుంచి తమ అవసరాల కోసం నెలనెలా కొంత డబ్బును పెన్షన్ రూపంలో తీసుకుంటారన్నారు. ప్రతీ ఒక్కరూ తమ సంపాదనలో కొంత డబ్బును వృద్ధాప్యంలో ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, ఇతర అవసరాల కోసం దాచుకోవాలని సూచించారు. పెన్షనర్లంతా ఈ భవనంలో కూర్చొని ఆనందపరవశులయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఇలాంటి భవనం కావాలని కలలుగన్నామని, ఇప్పుడు ఆ కల నిజమైనందుకు సంతోషంగా ఉందని పెన్షనర్లు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, బండ్లగూడ కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్, మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కమీషనర్ శరత్‌చంద్ర, కార్పోరేటర్లు గోకరి శ్రీలత సురేష్‌గౌడ్, నిఖిల సంగారెడ్డి, బుర్ర సాగర్‌గౌడ్, అస్లాం, కో ఆప్షన్ సభ్యులు మలాకిరత్నం, నాయకులు పూలపల్లి కృష్ణారెడ్డి, సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

## దేవాదాయ ధర్మాదాయశాఖను రద్దు చేయాలి

**నాంపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయశాఖను రద్దుచేసి రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలన ఆల్ ఇండియా రక్షణసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ సాహిద్ ఖాన్, పార్టీ జాతీయ అధ్యక్షుడు రామకృష్ణులు కోరారు. వీరు చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో కుంకుమ ధరించి అమ్మవారికి పూజలు నిర్వహించి మాట్లాడుతూ ఇతర మతాలకులేని కేవలం హిందూ దేవాలయాలకే అన్వయించడం, దేవాలయాల నుండి వచ్చే ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేర్చడం ఎవరు చెప్పిన సెక్యులరిజమని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇలాంటి చర్యల వల్ల సెక్యులరిజం వర్ధిల్లదు పైగా హిందువుల్లో అభద్రతాభావం పెరుగుతుందన్నారు. ప్రభుత్వాలు అన్యాయమైన సూడో సెక్యులరిజం చర్యలు చేస్తుంటే సమానత్వం ఎక్కడుందని ప్రశ్నించారు. దేశంలోని అందరూ భారతీయులు ఒకటేనని, అన్ని మతాలకు, కులాలకు రాజ్యాంగం ఒక్కటే.... కల్పిస్తున్న హక్కులూ ఒక్కటేనని, అందరికీ చట్టాలు, న్యాయం ఒకేవిధంగా పనిచేస్తాయనే సందేశాన్ని ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వారు గుర్తుచేశారు. ఈ అంశాన్ని ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లోనే చర్చించి తగునిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కోరారు.

## హైదరాబాద్ నగర శివార్లలో వీధి కుక్కలపై విష ప్రయోగం

### -కుక్కల మృత్యువాతపై రాచకొండ కమిషనర్‌కు ఫిర్యాదు -విచారణ చేస్తున్న మీర్‌పేట్ పోలీసులు

**సరూర్‌నగర్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్ రోడ్ నెంబర్ 5లోనున్న శ్రీద్వారకామాయి సాయిబాబా పీఠం వీధిలో ఆశ్రయం పొందుతున్న వీధి కుక్కలకు గుర్తు తెలియని వ్యక్తులు ఆహారంలో విషం పెట్టి చంపుతున్నారని పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ రాచకొండ పోలీస్ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానికంగా తమ పీఠం ఉన్న వీధిలో గత కొన్ని సంవత్సరాల నుండి పలు వీధి కుక్కల ఆలనా పాలనా చూస్తూ తమ పీఠం పార్కింగ్ స్థలంలో ఆశ్రయం ఇస్తున్నామనీ వాటికి నిత్యం ఆహారాన్ని పెట్టడంతో పాటు టీకాలు కూడా వేయించడం జరిగిందని ఆయన కమీషనర్ దృష్టికి తెచా ్చరు. అయితే ఇటీవల కొన్ని రోజుల్లో నాలుగు శునకాలు అనుమానాస్పద స్థితిలో చనిపోయాయనీ వాటికి పెడిగ్రీ ఆహారంలో విషం పెట్టి గుర్తు తెలియని వ్యక్తులు చంపి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండే కొంత మంది కుక్కలపై విష ప్రయోగం జరిపి ఉంటారనే అనుమానాలు స్వామీజీ వ్యక్తం చేశారు. పశువైద్యులు సైతం పరీక్షించి విష ప్రయోగం వల్ల కుక్కలు చనిపోయాయని నిర్ధారించారని తెలిపినట్లు వివరించారు. ఈ విషయమైన పీఠం తరపున మల్లాది సాయికుమార్ సైతం ఫిర్యాదు చేశాడని పీఠాధిపతి తెలిపారు. ఈ మేరకు పోలీసులు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గోపాలకృష్ణానంద స్వామీజీ కమీషనర్ కోరారు. కాగా ఫిర్యాదులపై స్పందించిన మీర్‌పేట్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి వచ్చి వివరాలు సేకరించారు. ఈ మేరకు వారు విచారణ చేస్తున్నారు.

## భవనంపై నుంచి కిందపడి వాచ్‌మెన్ మృతి

**కంటోన్మెంట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** నిర్మాణంలో ఉన్న భవనం నాలుగవ అంతస్థులో క్యూరింగ్ చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన విశాద సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో కలకలం రేపింది. పోలిసులు సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా బహబూబాబాద్‌కు చెందిన యాకయ్య (55)తన భార్య సావిత్రితో నగరానికి బతుకుదెరువుక ఓసం వచ్చి బోయిన్‌పల్లిలోని అంజయ్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో యాకయ్య ఇంటి సమీపంలోని షేక్ జహింగీర్‌కు చెందిన నిర్మాణంలో ఉన్న భవనంలో వాచ్‌మెన్‌గా పనికి కుదిరాడు. రోజూలాగే సోమవారం రాత్రి నిర్మాణంలో ఉన్న భవనం నాలుగవ అంతస్థులో యాకయ్య నిర్మాణానికి నీళ్లు చల్లుతున్నాడు. ప్రమాదవశాత్తు కిందపడి ఆక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. తన భర్త ఇంటికి రాలేదని అతని భార్య సావిత్రి భవనం వద్దకు వచ్చి చూసినా భర్త కనిపించలేదు. దీంతో పక్కనే ఉన్న యజమాని షేక్ జహింగీర్ వద్దకు వెళ్లి తన భర్త కనిపించడం లేదని విచారించింది. ఇంతలోనే ఓ గుర్తు తెలియని మృతదేహం చెత్తకుప్పలో పడి ఉందని అటుగా వెళ్లే వాహనదారులు 100కు డైల్ సమాచారం అందించారు. తీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఇంతలో స్థానికుల సమాచారంతో అక్కడి చేరుకున్న సావిత్రి తన భర్త యాకయ్య మృతదేహాన్ని గుర్తించింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చూరికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

## ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుండి పడి వ్యక్తి మృతి..

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త**

ప్రమాదవాషత్తు బిల్డింగ్ పైన నుండి పడి ఓ వ్యక్తి చనిపోయిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహేష్ శిందే పేట్ బషీరాబాద్‌లోని హర్ష హాస్పిటల్ వెనకాల నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో సోమవారం ఉదయం 6.30 గంటలకు సెంట్రింగ్ పనికి వెళ్ళాడు. కాంట్రాక్టర్ శ్రీనివాస రావు, యజమాని బాబు రావు ఆదేశాల మేరకు అయిదవ అంతస్తూలో సెంట్రిల్ పని చేస్తూ ప్రమాదవశాత్తు అదుపు తప్పి కింద పడిపోయాడు. వెంటనే మిగత పని వారు అందరూ కలిసి హర్ష హిస్పిటల్‌లో జాయిన్ చేసారు. తీవ్రంగా గాయపడిన మహేష్ శిందే చికిత్స పొందుతూ మంగళ వారం రాత్రి 7.15 గంటలకు మరణించాడు. మృతుని భార్య శిందే నమ్రత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భార్య మృతికి కారకుడైన భర్తకు రిమాండ్

### -అత్తమామలకు నోటీసులు

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త**

అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేసి తన భార్య మృతికి కారకుడైనా భర్తను రిమాండ్కు తరలించగా అత్తమామలకు నోటీసులు జారీ చేసిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లిలోని యుఎస్ఓ ఆర్కెడ్ అపార్ట్మెంట్ ప్లాట్ నంబర్ 113లో నివాసం ఉంటున్న పిన్న శశికాంత్ సుమలకు గత కొన్నెండ్ల కిందట వివాహం జరిగింది. వీరికి వరుణాయి(5), చాణిక్య (15 నెలల) పిల్లలు ఉన్నారు. గత కొద్ది రోజుల నుండి సుమను తన భర్త శశికాంతో పాటు మామ, అత్తలు నిత్యం అదనపు కట్నం కోసం వేధింపు లకు గురి చేయడంతో పలుమార్లు ఇరువురి కుటుంబ సభ్యుల మధ్య ఒప్పించారు. అయినా తీరు మారకపో వడంతో తీవ్ర మనోవేధనకు గురైన సుమ నవంబర్ 10న ఉదయం గుండ్లపోచంపల్లిలోని రైల్వేట్రాక్‌పై పడి ఆత్మహత్య చేసుకుంది. దీంతో మృతురాలి తల్లి మీనా ఈ నెల 4న పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టగా భర్త శశికాం త్‌ను రిమాండ్కు తరలించగా వృద్ధులైనా అత్తమామలకు నోటీసులు జారీ చేసిన్నట్లు తెలిపారు.

## కాన్షిరాం ఆశయ సాధన కోసం పాటుపడాలి

**గోషామహల్, డిసెంబరు 17ప్రభాతవార్త:**

కాన్షీరాం ఆశయ సాధన కోరకు బహుజనలందరు ముందుకు రావాలని హైదరాబాద్ జిల్లా బిఎస్‌పి అధ్యక్షులు పి.వై.గిరి మహారాజ్, ఇన్‌చార్జ్ అల్లోల రమేష్‌లు అన్నారు. ఈమేరకు గోషామహల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బిఎస్‌పి సమావే శం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళిత బహుజనులు రాజ్యాధికారం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అగ్రకులాల పార్టీలుకేవలం దళితులను, బహుజనులను కేవలం ఓటు బ్యాంక్‌గానే వాడుకుంటున్నట్లు తెలిపారు. దళితుల బహుజనులు విద్య, వైద్య, ఉద్యోగ రంగాలతోపాటు రాజకీ య రంగాలల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. ఈసందర్భంగా గోషామహల్ నియోజకవర్గం బిఎస్‌పి అధ్యక్షులుగా కళ్యాణ్‌నందేష్‌ను నియమించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోను సాల్మన్, యాకు త్‌పురా నియోజకవర్గం అధ్యక్షులు రవి కిషన్, సీనియర్ నాయకులు ఆధారిరాజేష్, రామ్‌చందర్, రాకేష్, తుంకుంట్ల జైకుమార్, శ్యామ్, కళ్యాణిగంగమ్మ, కళ్యాణి నాగేశ్వరి పాల్గొన్నారు.

## ఎంబిఎస్సీ కులాలకు 7 శాతం రిజర్వేషన్లు కేటాయించండి



కమిషన్ చైర్మన్‌కి వినతిపత్రం ఇస్తున్న బైరి వెంకటేశం, కర్నె రామారావు తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
దళిత ప్రయోజనాలు పొందడంలో 78 ఏళ్లుగా అణిచివేతకు గురై దళితుల్లో అత్యంత వెనుకబడిన ( ఎంబిఎస్సీ)57 కులాలకు ఎస్సీ వర్గీకరణలో 7 శాతం రిజర్వేషన్స్ కల్పించి ఏవర్గంలో చేర్చాలని ఎస్సీ 57 ఎంబి ఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం మోచి అన్నారు. ఈ మేరకు మంగళవారం బిఆర్కె భవన్లో ఎస్సీ వర్గీకరణ పై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ను పలువురు ఎంబిఎస్సీ కులాల నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ తో 57 ఎంబి ఎస్సీ కులాల స్థితిగతులపై, ఇంతకాలం ఈ కులాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ పరంగా జరిగిన అన్యాయంపై సుధీర్ఘంగా చర్చించారు. మా కులాలను మాల మాదిగ కులాలతో కలపకుండా ప్రత్యేక కేటగిరిలో ఉంచి జనాభా దమాషా ప్రకారం కాకుండా అన్ని రంగాల్లో వెనుకబాటు తనం ఆధారంగా 7 శాతం రిజర్వేషన్స్ ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు కనీసం కులపత్రాలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, నూతన జనాభా లెక్కల ప్రకారం అన్నిరంగాల్లో వెనుకబాటు తనం ఆధారంగానే 57 కులాలకు అధికశాతం రిజర్వేషన్స్ కల్పించాలని విజ్ఞప్తి చేసారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు 57 ఎంబి ఎస్సీ కులాల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమ కులాలను ఆదుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పంబాల కులవృత్తి కళాకారులు తమ జామిడిక వాయిద్యంతో , డక్కలి కళాకారులు కిన్నెర వాయిద్యం తో పాటల రూపంలో తమ సమస్యలను కమిషన్ చైర్మన్ కి వినిపించారు. వెనుకబడిన దళిత కులాలందరికి సామాజిక న్యాయం జరిగేలా చూస్తామని కమిషన్ చైర్మన్ హామీ ఇచ్చారన్నారు ఈ కార్యక్రమం లో నాయకులు కర్నె రామారావు డక్కలి, కురువ జయరాములు మదాసి కురువ, రాయిల లక్ష్మీనర్సయ్య చిందు, సనాధన్ మాంగ్ గారోడి, సుద్దాల కుమారస్వామి, బత్తుల పాండు పంబాల , సంపత్ గోసంగి, మల్లు ప్రసాద్ మాల దాసరి, బొబ్బిలి రమేష్ మాలజంగం, పర్శపాక శ్రీనివాస్ మాదిగ దాసు, కొలుపుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ శ్రేయస్సు కోసం పోరాడేది సిపిఐ : సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



**కొంపల్లి, డిసెంబర్ 17, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట శాఖ పార్టీ సభ్యత్వం పునరుద్ధరణ సందర్భంగా మంగళవారం శాఖ సభ్యులకు పార్టీ సభ్యత్వ కార్డులను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి అధ్యక్షత వహించగా ఉమా మహేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి సభ్యత్వాలు అందచేసి మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కొరకు ప్రాణ త్యాగాలకైనా సిద్దమని చెప్పి తెల్ల దొరలు పోయి నల్ల దొరలు కాదు సంపూర్ణ స్వాతంత్ర నినాదాన్ని ఇచ్చి అందరికి సమానమైన ఫలాలు అందించాలంటే సోషలిస్టు వ్యవస్థతోనే అది సాధ్యమని నాటి నుండి నేటి వరకు అనేక త్యాగాలను చేసిన చరిత్ర సిపిఐకే ఉందని అన్నారు. అన్ని బూర్జువా పార్టీలు వారి నాయకత్వం లేక పెట్టుబడిదారుల కోసం పని చేస్తాయని కానీ కమ్యూనిస్టులు మాత్రం పేద మధ్యతరగతి ప్రజల కోసం అనుక్షణం పోరాటం చేస్తారని అన్నారు. సిపిఐ సభ్యత్వం అందరికి ఇవ్వరని దాని సిద్ధాంతం కోసం ఎర్రజండా పట్టేవారికి మాత్రమే ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జానకిరామ్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, సభ్యులు నగేష్ చారి, సోమయ్య, సామెల్, రవి, నర్సింహారెడ్డీ, భాస్కర్ పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ కార్మికుల కేటగిరి మార్పు చేయకుంటే ఉద్యమమే

### -వాటర్‌బోర్డు సీవరేజ్‌బోర్డు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ హెచ్చరిక



ప్రసంగిస్తున్న వాటర్‌బోర్డు సీవరేజ్‌బోర్డు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ

**చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** వాటర్‌వర్క్స్ లో పనీ చేసే ఔట్ సోర్సింగ్ కార్మికుల గత బీవీ మార్చిన సందర్భంగా మిగిలిపోయిన వారందరిని కేటగిరి మార్చి జీతాలు పెంచడంతో ఇతర సమస్యలు పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షుడు నారాయణ గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో హైదరాబాద్ మెట్రోవాటర్‌వర్క్స్ సీవరేజ్‌బోర్డు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతు వాటర్‌వర్క్స్ లో పని చేసే ఔట్ సోర్సింగ్ కార్మికులు చాలీ, చాలని వేతనాలైన రూ.13,500లతో నగరంలో బ్రతకడం చాలా కష్టం కనుకనే గత 2023 ఆగస్టు లో జీవో 60 ద్వారా వేతనాలు పెంచిన సందర్భంగా కేటగిరి-2 లో చేర్చాల్సిన కార్మికులను కేటగిరి-1 లో చేర్చడం ద్వారా ప్రతి కార్మికునికి నెలకు రూ.4వేలు నష్టపోతున్నారని, అధికారుల తప్పిదాన్ని సరిదిద్ది కేటగిరి మార్చి జీతాలు పెంచాలని డిమాండ్ చేసారు. వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే బోర్డు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, నాయకులు శ్రీనివాసరెడ్డి కుమార్ ఆంజనేయులు, రమేష్, కుమార్, వీరాస్వామి, బాల్‌రాజ్., సురేష్, ప్రవీణ్, యాదగిరి, విజయ్, రమాదేవి, తార, బాబు, అశోక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ సంస్థల పెన్షనర్లకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలి



ప్రసంగిస్తున్న తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు కొక్కుల దేవేందర్

**చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘ అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. మరోసారి అధ్యక్షుడిగా కొక్కుల దేవేందర్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు, ప్రధాన కార్యదర్శిగా సోమశివయ్య, కోశాధికారిగా దాచెపెల్లి బుచ్చయ్య గారు ఎన్నికైనారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగిన సమావేశంలో ఎన్నిక ప్రక్రయను నిర్వహించారు. ఈ సందర్భంగా కొక్కుల దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల, పెన్షనర్ల చిరకాల డిమాండ్ 010 పద్దు ద్వారా జీతాలు, పెన్షన్స్ ట్రెజరి నుండి ప్రభుత్వం నుండి చెల్లించాలి. 310/311 పద్దు క్రింద సాలరీ గ్రాంట్ ప్రభుత్వమే 1975 నుండి చెల్లించడానికి ట్రెజరీ నుండి జీతాలు, పెన్షన్స్ చెల్లించాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, గత ప్రభుత్వము కుంటి సాకులు చెప్పి తప్పించుకోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం, ఇచ్చిన పార్టీ అయిన కాంగ్రెస్, ప్రస్తుత ప్రజాప్రభుత్వం పాలన వచ్చినందున, ఇదే అంశంపై సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రులకు, సలహాదారులకు, అధికారులకు సాలరీ గ్రాంట్ ద్వారా జీతాలు, పెన్షన్స్ ప్రభుత్వము చెల్లించుచున్న దానిని 010 పద్దు ద్వారా జీతాలు, పెన్షన్స్ చెల్లించాలని పలుమార్లు వినతిపత్రాలను ఇవ్వడం జరిగిందన్నారు. కాగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి విద్యాశాఖ కార్యదర్శికి ఆదేశాలు వస్తున్నాయని, దీనిపై చర్యలు తీసుకోడం లేదు, ఆర్థిక భారము లేని డిమాండ్లను పరిశీలిస్తామని సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపినందున, సంబంధిత అధికారులు సిఎం దృష్టికి ఇప్పటికైనా తీసుకవెళ్ళడంతో పాటు సిఎంను కలిసేందుకు వీలుగా అపాయింట్మెంట్ ఇస్తే తమ సమస్యలను వెల్లడించడంతో పాటు ఆర్థిక భారము లేనందున వివరంగా తెలుపుతామన్నారు. ఎన్నికల అధికారిగా తుమ్మ సత్య నారాయణ వ్యవహరించారు. కాగా తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘము సహ కార్యదర్శిగా ఆడం షఫీలను ఎన్నుకున్నారు. కాగా , కార్యవర్గ సభ్యులను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల అధికారి తుమ్మ సత్యనారాయణ తెలిపినారు.

## భక్తిమార్గం ప్రశాంతతకు మార్గదర్శి

..మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి....



అయ్యప్ప స్వామి పడిపూజ పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**కొత్తూర్, డిసెంబరు 17, ప్రభాతవార్త :** ప్రతి భక్తుడి జీవితంలో అయ్యప్పస్వామి కరుణాకటాక్షం ఉండాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డులో మధుసూదన్‌గౌడ్, సోదరుడు వంశీగౌడ్ స్వామి ఆధ్వర్యంలో గురుస్వామి గిరీష్‌నాయర్ సమక్షంలో పడిపూజ అంగరంగ వైభంగా నిర్వహించారు. హరిహర తనయుడు మణికంఠున్ని పంచామృతాలతో అభిషేకించారు. గణపతి, శివయ్య, అయ్యప్ప స్వామి చిత్రపటాలను వివిధ రకాల పూలతో అందంగా తీర్చిదిద్దారు. ఈకార్యక్రమానికి ముఖ్యనాయకులు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు పిస్నింటి మధుసూదన్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి పడిపూజలో పాల్గొన్న దీక్ష స్వాములు అయ్యప్ప భజన పాటలను అలపిస్తూ నృత్యాలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరు భక్తిభవం అలవర్చుకుని సన్మార్గంలో పయనించాలని సూచించారు. భక్తిమార్గం ద్వారానే మనిషికి ప్రశాంతత లభించి తను ఆశించిన శిఖరాలకు చేరుకునేందుకు భక్తిభవన ఎంతో సహకరిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో గురుస్వాములు హరిజీవన్‌స్వామి, స్వాములు నవాబ్‌పేట్ శేఖర్‌గౌడ్‌స్వామి, మాదారం నరసింహగౌడ్, దేవల్లి అశోక్‌గౌడ్, కుమారస్వామిగౌడ్, ఎర్రవల్లి నాగరాజుచారి, సోమ్లానాయక్, దాసరి నరసింహ, అల్వాల సురేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, యువనాయకుడు నవీన్‌చారి, తుప్పరరవి, భక్తులు ఉన్నారు.

### ధరం స్వరూప్ పెన్షనర్ల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి

**వికారాబాద్,డిసెంబరు 17, ప్రభాతవార్త:** ధరం స్వరూప్ నకార పెన్షనర్ల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని, డిసెంబర్ 17 పెన్షనర్లు మరచిపోని రోజు అని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వికారాబాద్ మండల అధ్యక్షులు మాణిక్య ప్రభు తెలిపారు. పట్టణంలోని సత్యసాయి జ్ఞాన కేంద్రంలో జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా మంగళవారం విశ్రాంత ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరం స్వరూప్ నకార పెన్షనర్ల కోసం పోరాడి వారి ఆత్మ గౌరవాన్ని కాపాడిన మహా మనిషి అని తెలిపారు. పెన్షన్ మనకు ఇచ్చె ఒక బహుమానం కాదని, గతంలో అందించిన సేవలకు చెల్లింపని పేర్కొన్నారు. ప్రాథమిక సభ్యులు బెంజమిన్ మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగులు కుటుంబానికి తాళం చెవివంటి వారని తెలిపారు. సమయం వృధా చేయకుండా పుస్తకాలుచదవడం,రేడియో వినడం,ఇంటివారికిపనులలో సహకరించడం చేయాలని పేర్కొన్నారు. అసోసియేట్ అధ్యక్షులు బందెప్ప గౌడ్ మాట్లాడుతూ, పెన్షనర్లకు కాకిలాంటి కలుపుగోలుతనము, భగవంతునిపై ఏకాగ్రత, ప్రభుత్వంపై విశ్వాసము, తగినంత ఆహారము మొదలగు లక్షణాలు ఉండాలని అన్నారు. తదనంతరం 73 ఏళ్ల నిండిన 10 మంది పెన్షనర్లకు శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, కిష్టయ్య, సతీష్ చంద్ర, విజయరావు, విఠోబా, అలీముద్దీన్, మొగులయ్య, జనార్ధన్, సాయన్న, మనోహర్,విద్యాకర్ పాల్గొన్నారు.

### ఎబివిపి 43వ రాష్ట్ర మహాసభలను విజయవతం చేయండి

-ఏబివిపి చేవెళ్ల నగర కార్యదర్శి కుర్వ మహిపాల్ పిలుపు

**చేవెళ్ళ, డిసెంబరు 17, ప్రభాతవార్త:**23, 24, 25వ తేదిలల్లో సిద్దిపేటలో నిర్వహించే ఏబివిపి 43వ రాష్ట్ర మహాసభలను విజయవతం చేయాలని ఏబివిపి చేవెళ్ల నగర కార్యదర్శి కుర్వ మహిపాల్ పిలుపునిచ్చారు. ఎబివిపి చేవెళ్ల శాఖ అద్వర్యంలో మంగళవారం చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబివిపి 43వ మహసభల గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందరంగా ఏబివిపి చేవెళ్ల నగర కార్యదర్శి కుర్వ మహిపాల్ మాట్లాడుతూ జాతీయ పునర్నిర్మాణం సాధ్యంగా ఏబివిపి పనిచేస్తుందని, వివేకానంద, అంబేద్కర్ అశయ సాధనలో విద్యార్దులను జాతీయ వాదులుగా తయారు చేస్తున్న విద్యార్ది సంఘం ఒక్క ఏబివిపి మాత్రమేనన్నారు. విద్యార్థి సమస్యల కోసం నిరంతం పాటుపడుతున్న సంఘంగా ఏబివిపి గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రెటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యుడు నితిష్, కిషోర్, అరవింద్, మల్లేష్, శివ, గణేష్, అభి విద్యార్దులు పాల్గొన్నారు.

### బిజెపి లో చేరిన కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు

**ధారూరు,డిసెంబరు 17, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు కోకట్ మాధవరెడ్డి సమక్షంలో, వికారాబాద్ నియోజకవర్గ బిజెపి పార్టీ కోఆర్డినేటర్ వడ్ల నందు ఆధ్వర్యంలో మండల పరిధిలోని ము న్నారు సోమారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువనాయకులు కన్నె సుధాకర్ మంగళవారం బిజెపి లో చేరారు. ఈ సందర్భంగా బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, కమిటీ మెంబర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్, మాజీ ఎంపిటిసి చంద్‌రెడ్డి,మాజీ పట్టణ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలు

**మహేశ్వరం డిసెంబరు 17 ప్రభాతవార్త :**

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ టోర్నమెంట్లను నిర్వహిం చడం జరుగుతుందని, క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వ పెద్దపీట వేస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలో ప్రసిద్దిగాంచిన గడికోట క్రీడా మైదానంలో సీఎం కప్ టోర్నమెంట్‌ను ఎంపీడీవో శైలజా రెడ్డి, సీనియర్ నాయకుడు వత్తుల రఘుపతి, కాకి ఈశ్వర్ ముదిరాజ్ ఇతర నాయకులతో కలిసి ఆయన క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని అన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రెడ్డి, పల్లె భిక్షపతి, ఇంద్రకంటి నరసింహగౌడ్, పోతర్ల సాంబయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### చలో రాజ్‌భవన్‌ను విజయవతం చేయండి

-చేవెళ్ళ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీంభరత్

**చేవెళ్ళ, డిసెంబరు 17, ప్రభాతవార్త**

ఈ నెల 18న టిపిసిసి అద్వర్యంలో నిర్వహించే చలో రాజ్‌భవన్‌ను విజయవతం చేయాలని చేవెళ్ళ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీంభరత్ సూచించారు. బుదవారం ఉదయం 11గంటలకు టిపిసిసి అద్యక్షుడు మహేష్‌కుమార్‌తో కలిసి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద జనంతో రాజ్‌భవన్ వరకు ప్రదర్శన చేసామని తెలిపారు. చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో సిఎం రెవంత్‌రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసిసి ఇంచార్జి దీపాదాస్ మున్సి, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పాల్గోని చలో రాజ్‌భవన్‌ను విజయవంతం చేయాలని కోరారు

## పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి : పానుగోటి అర్జున్‌రావు

బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావు

**ఆమనగల్లు, డిసెంబరు17, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలాభివృద్ధికి పాటుపడిన సర్పంచుల పెండింగ్ బిల్లులను విడుదల చేయడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే వివక్ష చూపుతుందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు, మాజీ జడ్పీటీసీ అనురాధపత్యానాయక్ ఆరోపించారు. సర్పంచుల పదవికాలం ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం వెనుక తాత్పర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రజలు, గ్రామాల పట్ల బాధ్యతతో గత సర్పంచులు అప్పులు చేసి మరీ తమ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం పట్టణ అధ్యక్షుడు పత్యనాయక్, పార్టీ శ్రేణులతో కలిసి విలేకరుల సమావేశంలో అర్జున్‌రావు, మాజీ జడ్పీటీసీ అనురాధపత్యానాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత తెలంగాణ అగోమగోచారంగా తయారైందని, కక్ష్య సాధింపు చర్యలకు ప్రాధాన్యతనిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు ప్రజల బాగోగులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతి రంగం వెనుకబాటుకు కాంగ్రెస్‌సర్కారు విఫలమేకారణమని విమర్శించారు. గ్రామాల పట్లకాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ది లేదనేదానికి సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడమే నిదర్శనమన్నారు. ప్రత్యేకాధికారుల పాలనలోగ్రామాలలో అభివృద్ధికుంటుపడిపోయిందని, సకాలంలో ఎన్నికలను నిర్వహించలేని దీనస్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉందన్నారు. ఏడాది కాలంగా రాష్ట్రంలో అలజడి తప్ప కాంగ్రెస్ సాధించిందేమిలేదని అర్జున్‌రావు ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో రేవంత్‌సర్కారు రైతు వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని,రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ సర్కారుకు ప్రజలు తగిన బుద్దిచెప్పే రోజులు దగ్గరపడుతున్నాయని ఘాటుగా విమర్శించారు. లఘచర్ల రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తెలంగాణకే చెరగని మచ్చని తీసుకువచ్చారని అభివర్ణించారు. రైతులకు సంకేళ్ళు వేయడం, థర్డ్‌డిగ్రీ ప్రయోగించడం, తప్పుడుకేసులు బనాయించడం వంటి చర్యలు అందుకు నిదర్శనమన్నారు. తీసుకు వచ్చిందన్నారు. తెలంగాణరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ళ కాలంలో వ్యవసాయరంగానికి అండదండలు అందించి తెలంగాణ రైతన్నలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. నేడు ప్రతి రైతు బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలనికో రుకుంటున్నారని అర్జున్‌రావుఅన్నారు. కార్యక్రమంలోనాయ కులు,కార్యకర్తలు మాజీ సర్పంచ్ సోనశ్రీనునాయక్, సయ్యద్‌ఖలీల్, గుత్తిబ ాలస్వామి ,రమేశ ానాయక్ ,వస్పులసాయిలు,వడ్డెమోనిశివకుమార్, సైదులుగౌడ్, ఎనుముల రమేశ్, గణేశ్‌నాయక్, శంకర్,పరమేశ్, పంతునాయక్, శివ ఉన్నారు.

## పశువులకు లంపివైరస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

.పశువైద్యాదికారి డాక్టర్ శ్రీ దీప్తి



పోటోరైటప్: పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

**పెద్దేముల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** పశువులకు లంపివైరస్ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాదికారి డాక్టర్ శ్రీ దీప్తి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండల పరిధిలోని జనగాంలో పాడిపశువులలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాడాక్టర్ శ్రీ దీప్తి మాట్లాడుతూ పాడిపశువులలో గర్భకోశ వ్యాధులపై అవగాహన కలిగియుండాలని అన్నారు. పశువుల్లో వస్తున్న గర్భకోశ వ్యాధితో పాడిరైతులు ఎంతోగానో నష్టపోతున్నారని అన్నారు. తగు జాగ్రత్తలతో గర్భకోశ వ్యాధులను నివారించవచ్చని అన్నారు. పశువులకు లంపి వైరస్ సోకకుండా ఉండేందుకు పశువులకు ముందస్తుగా యాంటిబయోటిక్స్ ఇచ్చినట్లు వివరించారు. అనంతరం పాడిరైతులకు మందులను అందజేశారు. పాడిరైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాడిరైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలనుసద్వినీయోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, వెటర్నిటి అసిస్టెంట్ శివప్రసాద్, ఎల్ఎస్ఏ చంద్రశేఖర్, గోపాలమిత్రలు నరేందర్, శ్రీనివాస్, బందెయ్య, సిబ్బంది శేఖర్, ఇమ్రాన్,సిద్దిక్ పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు



పోలీస్‌లు అరెస్టు చేసిన బిఆర్ఎస్ నాయకులు

**బొంరాస్‌పేట్,డిసెంబర్17,ప్రభాతవార్త ః** భారతరాష్ట్ర సమితి(బిఆర్ఎస్) పార్టీ బొంరాస్‌పేట్ మండల ముఖ్యనాయకులను పోలీస్‌లు ముందస్తుగా అరెస్టులు చేయడం జరిగింది. ముందస్తు అరెస్టులు చేసిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు యాదగిరి,మాజీ వైస్ ఎంపిపిలు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపిటీసీలు తిరుపతయ్య,నర్సింహనాయక్ ,మాజీ సర్పంచ్ నారాయణ,కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్‌తో లగచర్ల గ్రామరైతులను అరెస్టు చేయడంతో వారితోపాటు కొడంగల్ కార్యకర్తలకు అండగా ఉంటామని హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశంలో పాల్గోనేందుకు కొడంగల్ నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యకర్తలు సమావేశంకు వెళ్లకుండా పోలీస్‌ల ద్వార ప్రభుత్వం అడ్డుకుందన్నారు.

### శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**శామీర్‌పేట, డిసెంబరు 17, ప్రభాతవార్త**

శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆ తరువాత అన్నదాన కార్యక్రమం జరిగింది. శామీర్‌పేటకు చెందిన దూడల మనిత్‌గౌడ్, దూడల మోహిత్‌గౌడ్‌ల పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయలంలో పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని దూడల బాల్‌రాజ్‌గౌడ్-మణెమ్మ దంపతులు, దూడల వెంకటేశ్‌గౌడ్-ప్రసన్న దంపతులు, దూడల ప్రవీణ్‌గౌడ్-గురుస్వామి,మమత దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తూంకుంటకు చెందిన తిగుళ్ల సుధాకర్ వారి కుటుంబ సభ్యులు 25కిలోల బియ్యంను అందజేయగ, తూంకుంటకు చెందిన ప్రధాని నర్సింహ్మ-కుమారి దంపతులు సహకరించారు. వివిధ గ్రామాల భక్తులు, అయ్యప్పమాలధార స్వాములు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలి

### మండల అభివృద్ది అధికారి సంధ్య

**మొయినాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్రసర్వే ప్రజాపాలనలో ఇళ్ళు ధరఖాస్తులు చేసుకున్న వారందరు వారి గ్రామాల్లో పంచాయితీ కార్యాదర్శులకు అందుబాటులో ఉండాలని మండల అభివృద్ది అధికారిణి సంధ్య తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో ఇళ్ళు లేని నిరుపేదలు, వారికి ఇళ్ళు కావాలని ప్రజాపాలన ధరఖాస్తులో ఇళ్ళుకావాలంటు ధరఖాస్తులో టిక్‌చేసి ధరఖాస్తు చేసుకున్నవారి యొక్క పేర్లు గ్రామపంచాయితీ కార్యాదర్శికి కనబడుతాయన్నారు, అట్టి వారి ఇంటి వద్దకు కార్యదర్శిలు వచ్చి వారి యొక్క పూర్తి వివరాలను యాప్‌లో ఆప్‌లోడ్ చేసుకుంటారని, వారి యొక్క ఆధార్ కార్డు, రేషన్‌కార్డు ఉన్నవారు సంబంధిత పత్రాలతో అందుబాటులో ఉండాలని కోరారు, మొయినాబాద్ మండలంలో మొత్తం 14876 ధరఖాస్తులు వచ్చాయన్నారు, ప్రస్తుతం ఈ రోజువరకు 722 పూర్తి అయ్యాయని ఇంకా ఈ నెల డిసెంబర్ 31లోగా పూర్తి ధరఖాస్తుల వివరాలను యాప్‌లో ఆప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, ఇందిరమ్మ ఇండ్ల యొక్క ప్రక్రియా వారం రోజుల నుండి కొనసాగుతుందని, రేపటి నుండి బుదవారం నుండి ముమ్మరంగా ఈ యొక్క కార్యాక్రమాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది గనుక ధరఖాస్తు దారులు అందుబాటులో ఉండాలని వారు కోరారు, ఇంకా పూర్తి వివరాలు గ్రామ కార్యాదర్శులు అందిస్తారని తెలిపారు,

## లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి

-బిఆర్ఎస్ నేత ధర్మారెడ్డి



**అత్తాపూర్ డిసెంబరు17,ప్రభాతవార్త :**

లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి,వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించిన రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పి వారిని వెంటనే విడుదల చేయాలని రాజేంద్రనగర్ బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ధర్మారెడ్డి పేర్కొన్నారు. బిఆర్ఎస్ ఆది నాయకత్వం పిలుపుమేంకు మంగళవారం రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ...ఎస్టీ,ఎస్సీ అభాగ్యులైన రైతన్నలను కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ,కర్కాశంగా అణిచివేత విధానాలకు స్వసినత పలకాలని రైతన్నలపై పెట్టి అక్రమ కేసులను వెంటనే ఎత్తి వేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు ప్రీతం రాజ్,నవీన్ కుమార్,కావేలి గూడం గిరిబాబు,బండ్ల నరేందర్,ఉమా రెడ్డి, మహమ్మద్ అద్రిస్,కట్టెలమండి గౌతం,నరేష్ ముదిరాజ్,అశ్వక్ ,శ్రీను, సారంగపాణి,శీను,కాకా,కమల్,అక్బర్,సురేష్,మారి,వెంకటేష్ పాల్గొన్నారు.

## సర్వే జాగ్రత్తగా నిర్వహించాలి



సర్వే చేస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్

**జిల్లెడుచౌదరిగూడ, డిసెంబరు 17,(ప్రభాతవార్త):** గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎలాంటి తప్పులు లేకుండ సరిగ్గా నిర్వహించాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని గుర్రంపల్లి, రావిర్యాల, ఎదిర, ముష్టిపల్లి, చింతకుంటతాండ, చేగిరెడ్డి ఘనాపూర్ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్నట్లు వివరించారు. సర్వే చేస్తున్న సిబ్బందికి గ్రామ ప్రజలు సహాకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు. కిషోర్, అంజనేయులు,పాల్గొన్నారు.

### నర్సరీని సందర్శించిన టెక్నికల్ అసిస్టెంట్

**జిల్లెడుచౌదరిగూడ, డిసెంబర్ 17,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఉపాధి హామీ నర్స రీని టెక్నికల్ అసిస్టెంట్ వినోద్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధలన ప్రకారం పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

### లక్కీ వైన్స్‌లో దొంగల చేతివాటం

సిసి కెమెరాలతో సహా ఖరీదైన మద్యం చోరీ

**షాద్‌నగర్, డిసెంబరు 17 (ప్రభాతవార్త) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని కేశంపేట రోడ్డు బైపాస్ సమీపంలో గల లక్కీ వైన్స్ షాపులో అర్ధరాత్రి దొంగలు తమ హస్తవాటాన్ని ప్రదర్శించారు. బాధితుడు వైన్స్ యజమాని తెలిపిన వివరాల ప్రకారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో వైన్ షాప్ వెనక నుండి తలుపును గడ్డపారతో పగలగొట్టి లోపలికి వచ్చారని, గడ్డపారను అక్కడే వదిలేశారని, వైన్‌షాపులో ఐదు వేల రూపాయలతో పాటు రూ. 20 వేల విలువ చేసే ఖరీదైన మద్యం సీసాలను దొంగిలించారని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలు సీసీ కెమెరాలతో పాటు డీవీఆర్‌లో ఉండే హార్డ్ డిస్క్‌ను సైతం ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు.

### వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా సూరిశెట్టి

**షాద్‌నగర్, డిసెంబరు 17 (ప్రభాతవార్త) :** వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కార్యవర్గంలో షాద్‌నగర్‌కు చోటు లభించినట్లు ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రసిడెంట్ (మల్టిపుల్) దొంతు పాండురంగయ్య తెలిపారు. 2025 ఇంటర్నేషనల్ అధ్యక్షులుగా ఇరుకుల రామకృష్ణను నూతన కార్యవర్గంలో ప్రకటించినట్లు తెలిపారు. అదేవిధంగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన సూరిశెట్టి నరసింహ్మ గుప్త ఇంటర్నేషనల్ డైరెక్టర్ (మల్టిపుల్)గా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే డిస్టిక్ వి 102ఏ కు గాను 2024 ఇంటర్నేషనల్ స్థాయిలో రెండవ బెస్ట్ క్లబ్ మరియు గవర్నర్‌గా అవార్డు లభించినట్లు తెలిపారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ కార్యవర్గంలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఇరువురికి చోటు లభించడం పట్ల స్థానిక వాసవి క్లబ్, వనిత క్లబ్, ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సభ్యులు వారిని అభినందించారు.

### 11వ వార్డులో రూ.8 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం



సిసి రోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్

**షాద్‌నగర్, డిసెంబరు 17 (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ పట్టణంలోని 11వ వార్డులో రూ. 8 లక్షల మున్సిపల్ నిధులతో రెండు సీసీ రోడ్లను నిర్మించినట్లు కౌన్సిలర్ పిల్లి శారద శేఖర్ తెలిపారు. 11వ వార్డులోని అంగన్‌వాడీ, జీపీ బిల్డింగ్ వద్ద వేర్వేరుగా రెండు రోడ్లను నూతనంగా నిర్మించినట్లు తెలిపారు. ఈ సీసీ రోడ్ల నిర్మాణం సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నరేందర్, నాయకులు శ్రీశైలం, చీపిరి రవి యాదవ్, పార్థపురం బిక్షపతి, అంతపురం రాంచంద్రి, మజార్ అలీ, నారాగూడెం మహేష్, సాదక్, రాములు, నర్సింలు, అంజి, శివ, తదితరులు హాజరైనట్లు తెలిపారు.

## తట్టెపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

-ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి విజ్ఞప్తి

**పెద్దేముల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**

పెద్దేముల్ మండల పరిధిలో గల తట్టెపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తట్టెపల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని అసెంబ్లి సమావేశాలలో కోరారు. తాండూరు నియోజకవర్గం లోని పెద్దేముల్ మండలంలో తట్టెపల్లిని మండలంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలోనే తట్టెపల్లిపాంతం చాల వెనుకబడి ఉందని అన్నారు. అక్కడి ప్రాంత ప్రజలు పెద్దేముల్ మండల కేంద్రానికి రావడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అందుకు తట్టెపల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని అసెంబ్లిలో ఎమ్మెల్యే ప్రస్తావించారు. తట్టెపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనిఎమ్మెల్యే అసెంబ్లి సమావేశాలలో ప్రస్తావించడం పట్ల సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

## షాద్‌నగర్‌లో పెన్షనర్స్ డే సందర్భంగా సన్మానాలు

### షాద్‌నగర్ ఆర్డీవో తదితరులకు సన్మానాలు

**షాద్‌నగర్, డిసెంబరు 17 (ప్రభాతవార్త) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ షాద్‌నగర్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్స్ దేను పురస్కరించుకొని సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సరితను సన్మానించారు. అదేవిధంగా ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ పార్థసారధి, యూనియన్ ప్రధాన కార్యదర్శి జనార్ధన్, కోశాధికారి పాండు, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ గౌడ్, నర్సింలు, నాగేష్, ఏటీవో బాలరాజు, ఎస్టీవో మహేష్, ఆర్డీలను, జిల్లా నాయకులు జగదీష్, దుగ్గు శేఖర్, ఠాగూర్ విద్యా సంస్థల అధినేత రాజేంద్రప్రసాద్‌లను ఘనంగా సన్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో సరిత తనకు ఈ సన్మానం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.





17ఎస్‌డిఎస్‌ఆర్01 : పెన్షనర్స్‌డే సందర్భంగా ఆర్డీవో సరితను సన్మానిస్తున్న దృశ్యం

పెన్షనర్స్‌కు సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా యూనిట్ అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పెన్షన్ తమ హక్కని, ఉద్యోగి తన సేవా కావాలని గుర్తింపును, జీవన విధానానికి చిన్న పురస్కారమని తెలిపారు. అదేవిధంగా దీన్ని ఏ ప్రభుత్వమూ నిషేధించడానికి వీల్లేకుండా సుప్రీంకోర్టులో కేసు నడపించి పెన్షనర్స్ అందరికీ పెన్షన్ అందే విధంగా 1982 నుండి వర్తింపజేస్తూ సుప్రీంకోర్టు ద్వారా తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. ఇందుకు గాను పెన్షనర్స్ దేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ జీ, షబ్బీర్, అబ్దుల్ గఫార్, స్వరాజ్ బాబు, గోపాల స్వామి, గోపాల్‌రావు, నారాయణరెడ్డి, రమాదేవి, గిరిజ, అంజు, సామ్రాజ్యం, జయశ్రీ, గోపాల్ రెడ్డి, ముస్తఫా, మాణిక్యం, విష్ణుగౌడ్, చంద్రమౌళి, రవీంద్రనాథ్ జీ, బి.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, TELANGANA STATE, AT: AMANGAL.
O.S.No. 188 OF 2024

BETWEEN:
**Nedunuru Balamani,** W/o China Mallaiah, aged about 39 years, Caste; SC-Madiga, Occ: Agriculture, R/o H.No. 8-22, Chukkapoor, Talakondapally Mandal, Chennaram Village, Ranga Reddy District - 509 321. ...Plaintiff.

AND

1. **Sai Srinivas Sriparasa,** S/o Late Suryanarayana Rao Sriparasa, Aged about 38 years, Occ: Software Engineer, R/o 14/A, Vedanivas 1st Floor, Tulasi Nagar Colony, HMT Hills, Kukatpally, Hyderabad-500085 ...Defendant No.10.
2. **Mantirraju Venkatswara Rao,** S/o Mantirraju Venkata Krishna Murthy, Rep. by authorized person D.N. Ravi S/o D.N. Murthy, M/s ALIENS HILLS PVT.LTD/ ALIENS SMARTCITY PRIVATE LTD, Sy.No. 384/385, Aliens Space Station-1, Tellapur Village, RamachandraPuram Mandal, Hyderabad -502 032. ...Defendant No.11.
3. **ANKIT CHATER** S/o Late Pukhraj Chater, Aged about 37 years, Occ: Business, R/o H.No. 12-5-47, Moosapet, Balanagar, Rangareddy, Hyderabad - 500 018. ...Defendant No.12.
4. **Shiva Shankar Komakula** S/o Lingaiah Komakula, Aged about 43 years, Occ: Manager, M/s ALIENS HILLS PVT.LTD/ ALIENS SMARTCITY PRIVATE LTD, Sy.No.384/385, Aliens Space Station-1, Tellapur Village, Ramachandra Puram Mandal, Hyderabad-502 032. ...Defendant No.13.
5. **Mr. Parepalli Naga Venkata Sai Sunil** S/o Parepalli China Venkata Subba Rao, Aged about 26 years, Occ: Software Engineer, R/o 10-395/2, Ali Fancy Lane, Narayana Puram, Dachepalli, 10 ward, Nadikudi, Guntur District, Andhra Pradesh-522 414. ...Defendant No.20.
6. **Mohammed Ajas** S/o Mr. Mohammed Ismail, Aged about 56 years, Occ: Private Services, R/o H.No. 12-5-149/14/8/A, Flat No.315, Welcome Court Appts Tarnaka, Secunderabad-500017. ...Defendant No.21.
7. **Ms. Priyanka Khanna** D/o Dilip Kumar Khanna, Rep. by its authorized person D.N. Ravi S/o D.N. Murthy, M/s ALIENS HILLS PVT.LTD/ ALIENS SMARTCITY PRIVATE LTD, Sy.No. 384/385, Aliens Space Station-1,Tellapur Village, Ramachandra Puram Mandal, Hyderabad-502 032. ...Defendant No.28.
8. **Devasani Sharat Chandra** S/o Devasani Surender, Rep. by its authorized person D.N. Ravi S/o D.N. Murthy, M/s ALIENS HILLS PVT.LTD/ ALIENS SMARTCITY PRIVATE LTD, Sy.No. 384/385, Aliens Space Station-1, Tellapur Village, Ramachandra Puram Mandal, Hyderabad- 502 032. ...Defendant No.33.
9. **Md. Sikander** S/o Late Md. Mukhyyar, Aged about 63 years, Occ: Business, R/o 19-2-24/26/6, Ali Bagh, Kale Phater, Charminar, Hyderabad - 500 053. ...Defendant No.41

To,
TO WHOMSOEVER IT MAY CONCERN
NOTICE

Whereas the Plaintiff has filed the above suit seeking a perpetual injunction and consequential declaration to nullify and void the sale deeds, against the defendants, pertaining to the Plaintiff's agricultural land bearing Survey No. 38, measuring 3 acres and 24 guntas, situated at Chennaram Village, Talakondapally Mandal, Ranga Reddy District, Telangana State.

Take Notice: To Whomsoever It May Concern, including any person(s) or legal heirs of Defendant Nos. 10, 11, 12, 13, 20, 21, 28, 33, and 41, you are hereby informed to appear before the Hon'ble Junior Civil Judge, Ranga Reddy District, Telangana State, at Amangal on **27th January 2025 at 10:30 A.M.** for necessary steps in the matter pending before the Hon'ble Court, failing which exparte orders may be passed as per the law.

(By Order dt. 09-12-2024 of the Hon'ble JCJ Court Amangal in I.A No. 1058/2024 in O.S. 188/2024)

**Sd/- NENAVATH HANUMAN NAIK**
Advocate
Saroornagar, Hyderabad.
Cell No. +91 9000517133.

